క్లుప్తంగా

స్వాములకు సద్ది వితరణ



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో ఆదివారం గుండారాము దంపతులు వేదపండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి 350 మంది స్వాములకు సద్ది ఏర్పాటుచేశారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, అంబటి శ్రీనివాసరెడ్డి, పటాల సుబ్బారావు గురుస్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ఆర్యవైశ్య వన సమారాధన



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ ఆర్యవైశ్యల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం ఆదివారం పట్టణ సమీపంలోని కొండమోడులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. యరపతినేని అఖిల్, ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



పిడుగురాళ్ల: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పిడుగురాళ్ల గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు గ్రహీత వై.హెచ్.మోహన్‌రావును సన్మానించారు. ఎం.సతీష్‌కుమార్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు దగ్ధం



మాచర్ల రూరల్: పట్టణంలోని వినాయకుని గుట్ట ప్రాంతంలో తెల్లవారుజామున రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం ప్రకారం వినాయకుని గుట్ట ప్రాంతానికి చెందిన పోలేపల్లి ఆనంద్‌కు చెందిన హోండా షైన్, ఆలేటి లక్ష్మయ్యకు చెందినా హీరో హోండా ప్యాషన్ ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఈ సంఘటనలో బైకులు పూర్తిగా కాలిపోయాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



నాదెండ్ల: గణపవరం ఒకటో సచివాలయంలో ఆదివారం గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాండురంగారెడ్డి షుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులను పరిశీలించారు. ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించారు. సుమారు వంద మంది రోగులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు అందించి ఆరోగ్య సూచనలు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజర్ షేక్ సుభాని మాట్లాడుతూ సోమవారం నుంచి శుక్రవారం వరకూ చిలకలూరిపేటలోని ఆర్టీవో ఆఫీసు పక్కనే తమ క్లినిక్ ఉందని, ఇందులో ప్రతి రోజూ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సోమ, బుధ, శుక్రవారాల్లో కార్డియాలజీ, గురువారం న్యూరాలజీ, మంగళవారం ఎండీ జనరల్ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డాక్టర్ రాజా రమేష్ హాస్పిటల్‌తో సంయుక్తంగా ఆరోగ్యశ్రీ ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ సుమారు 30-60 నిమిషాల లోపు నడక, యోగా చేయడం వల్ల గుండె పదిలంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు మొగ్గు

- ఆశల పల్లకీలో మొక్కజొన్న రైతులు
- ఎకరాకు రూ. 20 వేల ఆర్థికసాయం అందజేస్తున్న ఐటీసీ, విత్తన కంపెనీలు
- మొక్కజొన్న విత్తనాలతో పాటు గడ్డిమందు, పురుగు మందు, రెండుసార్లు గుళికలు ఉచితం
- మద్దతు ధర సైతం ప్రకటించిన కంపెనీలు
- రెంటచింతల మండలంలో భారీగా పెరిగిన మొక్కజొన్న పంట విస్తీర్ణం



రెంటచింతలలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంట

రెంటచింతల: ఎన్నో ఆశలతో రెక్కలు ముక్కలు చేసుకుని పత్తి, మిరప వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తున్నా.. గిట్టుబాటు కాక అప్పులపాలై దిక్కుతోచక అల్లాడిపోతున్న రైతులకు మొక్కజొన్న సాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. ఈ ఏడాది మండలంలోని వివిధ గ్రామాలలోని రైతులను ఐటీసీ, భారతి కంపెనీలకు చెందిన ప్రతినిధులు కలిసి మొక్కజొన్న పంటను సాగుచేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్నసాగుకు మొగ్గుచూపారు.

3500 ఎకరాల్లో సాగు..

రైతులకు ఎకరాకు మొక్కజొన్న విత్తనంతో పాటు ముందుగానే పెట్టుబడి కింద రూ. 20 వేల ఆర్థిక సహాయం, గడ్డిమందు, పురుగు మందు, రెండుసార్లు గుళికలు ఉచితంగా అందచేయడం వలన రైతులకు కొంత ఆర్థిక వెలుసుబాటు కలగడంతో ఆసక్తి చూపారు. దీనికి తోడు కంపెనీవారే ముందుగానే క్వింటాకు రూ. 3,500 ధర కూడా ప్రకటించి పంటను కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులకు మార్కెట్‌కు తీసుకుపోయి అమ్ముకోవాల్సిన పరిస్థితి లేదు. 120 రోజులలో ఎకరాకు కనీసం 25 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉండటం వలన మండలంలోని రెంటచింతల, మిట్టగుడిపాడు, రెంటాల, సత్యనారాయణ పురం క్యాంపు, గోలి, పాలువాయి గ్రామాలలో సుమారు 3500 ఎకరాలలో మొక్కజొన్న పంటను రైతులు ఎన్నో ఆశలతో సాగుచేస్తున్నారు.

16 ఎకరాలలో సాగుచేస్తున్నా...



ముందుగానే మంచి గిట్టుబాటు ధర రూ. 3,500 నిర్ణయించి కంపెనీ వారే కొనుగోలు చేయడం వలన మొక్కజొన్న పంటను 16 ఎకరాలలో సాగుచేస్తున్నా. గత ఏడాది క్వింటా రూ. 2,600 మాత్రమే ఉంది. కంపెనీవారు పెట్టుబడి కింద ఎకరాకు రూ. 20 వేలు ఆర్థిక సహాయం చేయడం రైతుకు ఎంతో ఆర్థిక వెలుసుబాటు ఉంటుంది. కంపెనీవారు ఇచ్చే ఆర్థిక సహాయంతో పాటు ఎకరాకు సుమారు మరో రూ. 25 వేలు పెట్టుబడి పెడితే సరిపోతుంది. – గొంగడి శ్రీనివాసరెడ్డి, కౌలురైతు, మంచికల్లు

సన్నకారు రైతులకు మేలు



పంటసాగుకు ముందుగా పెట్టుబడి కింద ఆర్థిక సహాయం అందించడంతో పాటు మందులు కూడా కంపెనీవారు ఉచితంగా ఇవ్వడం వలన చిన్నసన్నకారు రైతులకు మేలు జరుగుతుంది. నేను కంపెనీవారు ఇచ్చిన విత్తనంతో 2 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నా. పంటకు సాగునీరు అందుబాటులో ఉంటే ఖచ్చితంగా ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. – పేర్ల చౌదయ్య, కౌలురైతు, రెంటచింతల

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవరూపాన్ని ధరించి సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి విధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచివ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన కేసులో వ్యక్తి అరెస్టు

పిడుగురాళ్ల: మహిళను వేధించిన కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణంలో ఓ సచివాలయంలో ఏఎస్ఎంగా పని చేస్తున్న కరిమున్నిసాను పి.సురేష్ అనే వ్యక్తి వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈమేరకు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు.

శివారాధన ఎంతో పుణ్యఫలం



భ్రమరాంబికాదేవి అమ్మవారు



సత్రశాల దేవస్థానంలో భక్తులకు అన్నదానం చేస్తున్న ఈఓ గాదె రామిరెడ్డి

సత్రశాల(రెంటచింతల): శివకేశవులకు ఎంతో ప్రీతికరమైన కార్తికమాసంలో శివారాధన చేయడం ఎంతో పుణ్య ఫలమని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు చిట్టేల మల్లిఖార్జునశర్మ అన్నారు. కార్తికమాసం పురస్కరించుకుని ఆదివారం అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దేవస్థానానికి అతి సమీపంలోని పవిత్ర కృష్ణానదిలో భక్తులు వేకువజామున కార్తికస్నానాలు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి, రుద్ర హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వి.పుల్లయ్య, నాగేంద్రమ్మ, వి.వెంకయ్య, రామలక్ష్మమ్మ, సీహెచ్. నాగేశ్వరరావు, సుబ్బమ్మ, కె.శేసిరెడ్డి, ఆదిలక్ష్మి, బి.దుర్గారావు, రమణ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంతో పురాతనమైన మల్లిఖార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి కృషి చేయడం అభినందనీయమని ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, మున్నా లింగయ్య తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే యరపతినేని ప్రత్యేక పూజలు..

మాచవరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని మోర్జంపాడు గ్రామ శివారులోని శ్రీభ్రమరాంబ సమేత బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయం నందు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా అయనకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ నిర్వాహకులు నూతనంగా నిర్మించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి మండపాన్ని ప్రారంభించారు. భక్తుల వసతి గృహ సముదాయానికి శంకుస్థాపన చేసారు.

రేపు మహిళలకు క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరం

చిలకలూరిపేట: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ నెల 19న ఉచిత గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సరోజిని, నార్నే జయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని చీరాల రోడ్డులో ఉన్న ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్త్రీలకు గర్భసంచి ముఖద్వార క్యాన్సర్ పరీక్ష, ఈసీజీ, బీపీ, షుగర్ టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వర్షానికి నేల వాలిన వరి పైరు



రొంపిచర్ల: మండలంలో ప్రస్తుత తరుణంలో నెలకొన్న వాతావరణం వరి రైతాంగానికి ఇబ్బందిగా మారింది. శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి పైరు అక్కడక్కడా నేలవారింది. ముఖ్యంగా విప్పర్ల, వి.రెడ్డిపాలెం, మాచవరం గ్రామాల్లో సాగు చేసిన వరిపైరులో ఈ పరిస్థితి నెలకొంది. బిర్రు పొట్టపై ఉన్న నేలవారిన పైరు దెబ్బతినకుండా నాలుగు, ఐదు మొక్కలను ఒకటిగా చేసి కట్టలు కడుతున్నారు. ఇలా చేయటం వల్ల వరిపైరు నిలబడి కంకులు వస్తాయని మాగాణి రైతుల నమ్మకం.

5న హైందవ శంఖారావం బహిరంగ సభ

వినుకొండ(నూజెండ్ల) : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కోరారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని ఎపీసీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో పలువురు మాట్లాడారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, నిర్వహణలో చేయాల్సిన సంస్కరణల గురించి సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ కొత్త రామకృష్ణ, వేదాంతం గోవిందరామానుజాచార్యులు, వీహెచ్‌పీ నాయకులు భాగవతుల రవి కుమార్, గోనుగుంట్ల గంటారావు, ఇమ్మడిశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బైక్ దొంగలు అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఐనవోలుకు చెందిన పలువురు యువకులను ఐనవోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. 10 వాహనాలను స్వాధీనం చేసుకొని విచారణ చేస్తు న్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

అయపప్స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి

రెంటచింతల: దైవసంకల్పంతోనే గోలి గ్రామంలో అయప్పస్వామి ఆలయనిర్మాణం జరుగుతున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం గోలి గ్రామ సమీపంలో అయప్పస్వామి ఆలయానికి ఆయన మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. అయ్యప్పస్వామి కరుణాకటాక్షాల కోసం భక్తులు స్వామిమాలను ధరించి 41రోజులపాటు దీక్ష తీసుకుంటున్నారన్నారు. గ్రామస్తులు సమష్టిగా కృషిచేసి ఆలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాచర్ల నియోజక వర్గంలో నాలుగు రహదారులకు ప్రభుత్వం రూ.117 కోట్లు మంజూరు చేసిందన్నారు. సత్రశాల – అడివిదేవులపల్లి, వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు – మద్దిమడుగు మధ్య కృష్ణానదిపై రెండు వంతనలు నిర్మించినట్లయితే ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సిహెచ్ అబ్బిరెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గురజాడ, జాషువాలకు ఘన నివాళి



గురజాడ, జాషువా చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ నిర్వాహకులు, విద్యార్థులు

ఈపూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన ఈపూరు శాఖా గ్రంథాలయంలో 4వ రోజు ఆదివారం కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డడ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషకు వారు చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాసరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

మండలంలోని ముప్పాళ్ల శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గడిపూడి నరసింహారావు పాల్గొన్నారు.. విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఎస్. నాగలక్ష్మి, గ్రామ పెద్దలు సూరె వెంకట నరసయ్య, నర్రా శ్రీనివాసరావు, వూట్ల పాపారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమావేశం



కళాశాల యాజమాన్యాన్ని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాలతో తమ అనుభవాన్ని పలువురు పంచుకున్నారు. కళాశాల అభివృద్ధిలో, న్యాక్ గ్రేడ్ సాధించడంలో పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయమని యాజమాన్యం పేర్కొంది. అనంతరం కళాశాల యాజమాన్యాన్ని పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డి. శివఫణీంద్ర, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నీలంపాటి అమ్మవారి తిరునాళ్ల



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో శ్రీనీలంపాటి అమ్మ వారి తిరునాళ్లను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని పురాతన బావి నుంచి బాలికలు మేళతాళాల నడుమ జల బిందెలను ఊరేగింపుగా తీసుకొచ్చి రాళ్ల పుట్ట వద్ద అభిషేకాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్ల పొంగించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన రామిరెడ్డి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు, వారి శిష్య బృందంతో ఘనంగా వేద పండితులు రావిపాటి సాయి భరత్ పూజలు నిర్వహించారు. మండలంలోని మతుకుమల్లి, గంటావారిపాలెం గ్రామాలకు చెందిన భక్త బృందం భజన, తిరుమల–తిరుపతి దాస సాహిత్య చెరుకూరి హనుమంతరావు సారథ్యంలో మహిళలు కోలాటం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కమిటీ సభ్యులు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేశ్ పర్యవేక్షించారు.

రైతులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



నడికుడి మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి: కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తికొనుగోలు కేంద్రం(సీసీఐ)ని ఆదివారం ఆయన ప్రారంభించారు. సీసీఐకి పత్తి తీసుకువచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. సీసీఐ కేంద్రాల ద్వారా రైతులు పండించిన పత్తి పంటను కనీస గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తామని, పత్తి విక్రయించిన రైతులకు సకాలంలోనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే యరపతినేని చెప్పారు. యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు బెల్లంకొండ బద్రి, నర్రా పుల్లయ్య, సొసైటీ నారాయణ, బుల్లెబ్బాయి, శ్రీరాములు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లిలోని లక్ష్మీ కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వెల్లటూరులో పుస్తక పంపిణీ ప్రచారం

బొల్లాపల్లి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరులో ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంతో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్తిక మాసం విశిష్టత గురించి వివరించారు. ఈ మాసంలో కార్తిక పౌర్ణమి రోజున దేవాలయాల్లోని ధ్వజ స్తంభం పైన దీపం వెలిగించడం వల్ల భగవంతుని అనుగ్రహం లభిస్తుందని కమిటీ సభ్యులు కె.సైదారావు తెలిపారు. కార్తిక మాసం డిసెంబరు ఒకటి వరకు ఉంటుందని, భక్తిశ్రద్ధలతో దీపారాధన చేయాలని తెలిపారు.

గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధ పుస్తక పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.అరుణ, కె.కార్తిక్, కె.నారాయణమ్మ, సీహెచ్. అనురాధ, ఎస్. వెంకటలక్ష్మి, డి. శ్రీను, ఎం. వీరయ్య పాల్గొన్నారు.

నేడు గాంధీ పార్కు ఎదుట 108 ఉద్యోగుల ధర్నా



జిల్లా మేనేజర్ సుబ్బారావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

నరసరావుపేట టౌన్: డిమాండ్ల సాధన కోసం సోమవారం స్టేషన్ రోడ్డు గాంధీ పార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు 108 ఉద్యోగులు తెలిపారు. సమస్యలు పరిష్కారం కోరుతూ 108 జిల్లా మేనేజర్ సుబ్బారావును కలిసి ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, ఉమా శంకర్ మాట్లాడుతూ సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేసే ఉద్యోగాలలో 108లో పని చేస్తున్న సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. అప్పటి వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటామని తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి



శావల్యాపురం: ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య ప్రచార కమిటీ అధ్యక్షులు గాలి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలోని సంసిద్ పాఠశాల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు తిలకించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.